దిల్‌సుఖ్‌నగర్ షిర్డి సాయిబాబా సంస్థాన్ ట్రస్టు సలహామండలి ప్రమాణ స్వీకారం

దక్షిణ షిర్డీగా ప్రసిద్ధిగాంచిన దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా దేవాలయం ట్రస్టు సలహా మండలి చైర్మన్‌గా వనం యాదయ్య ఎన్నిక య్యారు. సాయిబాబా సంస్థాన్ ట్రస్టు సలహా మండలి చైర్మన్‌గా వనం యాదయ్య, సభ్యులుగా సంస్థాన్ ట్రస్టు మాజీ చైర్మన్లు కొలిశెట్టి లక్ష్మయ్య, వనం రంగయ్య, గుండ మల్లయ్య, నర్సింహారావు, డాక్టర్ కె.లింగయ్య, బచ్చు గంగాధర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్త హాజరై మాట్లాడారు. దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా దేవాలయాన్ని ఆలయ కమిటీతోపాటుగా సలహామండలి వారు అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని సూచించారు.

– ఎల్బీనగర్, నవంబర్ 13

శిల్పారామంలో నేటి నుంచి డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు

కొండాపూర్, నవంబర్ 13: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మాదాపూర్‌లోని శిల్పారామంలో ఈనెల 14, 15వ తేదీల్లో డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు, వర్క్‌షాప్, చిల్డ్రన్ ఆర్ట్ డిసిప్లేలను నిర్వహిస్తున్నట్లు శిల్పారామం ప్రత్యేక అధికారి కిషన్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, సెల్ : 98666 27705 నంబర్ ద్వారా సంప్రదించాల్సిందిగా పేర్కొన్నారు. రెండు రోజులపాటు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. పోటీల్లో పాల్గొన్న చిన్నారుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లను అందజేయనున్నట్లు తెలిపారు.

ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 13 : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థలో ఉద్యోగాల కొరకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ క్యాటగిరిలో స్టేనో(టైపిస్ట్)(1) డిగ్రీతో పాటు(షార్ట్ హ్యాండ్) నిమిషానికి 120 పదాల స్పీడ్ ఉండాలి. ఇంగ్లిష్ (హయ్యర్) నిమిషానికి 45 పదాల టైప్ వచ్చి ఉండాలి. క్యాటగిరి-ఓ సీ(మహిళ)లో రికార్డు అసిస్టెంట్(1) 10వ తరగతి పాసై ఉండాలి. ఈనెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు రిజిస్టర్ పోస్ట్, స్పీడ్ పోస్ట్ ద్వారా చైర్మన్, డిస్ట్రిక్ లీగల్ సర్వీస్ అథారిటీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోర్ట్ కాంప్లెక్స్ అడ్రస్‌కు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు https://medchalmalkajgiri.dcourts.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

కాచిగూడ రైల్వేస్టేషన్‌లో పీఎంబీజేపీ కేంద్రం ప్రారంభం

కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ప్రధాన మంత్రి భారతీయ జనౌషధి పరియోజన(పీఎంబీజేపీ) కేంద్రాన్ని బుధవారం ప్రధాని మోదీ రిమోట్ వీడియో లింక్ ద్వారా ప్రారంభించారు. బీహార్‌లోని దర్భంగా నుంచి దీన్ని ప్రధాని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్, హైదరాబాద్ డివిజన్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం.ఏ.రేహ్మాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్ఎం లోకేష్ విష్ణోయ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ కాచిగూడ స్టేషన్‌తోపాటు 18 ప్రదేశాల్లో జనౌషధి కేంద్రాలను ప్రారంభించడం ఒక చారిత్రాత్మకమన్నారు. రైల్వేస్టేషన్‌లలో సౌకర్యాలు, సదుపాయాలను స్థిరంగా పునరాభివృద్ధి చేయడం ద్వారా ప్రజల విభిన్న అవసరాలను తీర్చేందుకు భారతీయ రైల్వే కట్టుబడి ఉందన్నారు. పలువురు అధికారులు పాల్గొన్నారు. *– కాచిగూడ, నవంబర్ 13*

పోతులూరి వీరబ్రహ్మం విగ్రహానికి నివాళులర్పించిన హైకోర్టు విశ్రాంత జడ్జి చంద్రకుమార్, జూలూరి గౌరీశంకర్

కాలజ్ఞానం నేటి సమాజానికి అవసరం

ముషీరాబాద్, నవంబర్ 13: పోతులూరి వీరబ్రహ్మం కాలజ్ఞానం నేటి సమాజానికి అవసరమని హైకోర్టు విశ్రాంత జడ్జి చంద్ర కుమార్ అన్నారు. వీరబ్రహ్మం బోధనలు, కాలజ్ఞానం అందుబాటులోకి తీసుకురావాలన్నారు. బుధవారం ట్యాంక్‌బండ్‌పై వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జస్టిస్ చంద్రకుమార్ పాల్గొని వీరబ్రహ్మం గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోతులూరి కాలజ్ఞానం మార్గాన్ని చూపిస్తూ సమాజ సమతుల్యతలను నిలబెట్టిందన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ.. కులమత బేధాలకు అతీతంగా సమానత్వాన్ని చాటి చెప్పిన పోతులూరి ఆదర్శప్రాయులన్నారు. అజ్ఞానపు చీకట్లను చీల్చి జ్ఞాన వెలుగులు ప్రసాదించిన తత్వవేత్త, గొప్ప దార్శనికుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ కమిటీ కన్వీనర్ అట్లూరి రవీంద్రచారి, ఓయూ ప్రొఫెసర్ వెంకటరామయ్య, రవీంద్రాచారి, అన్న భీమోజు జితేంద్ర, రాఘవేంద్ర, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

16 మంది సీఐలకు తాత్కాలిక డీఐలుగా బాధ్యతలు

సిటీబ్యూరో, నవంబర్ 13(నమస్తే తెలంగాణ): నగరంలో పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న 16 మంది ఇన్‌స్పెక్టర్లకు తాత్కాలికంగా డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్లుగా ఆయా పోలీస్‌స్టేషన్లకు అటాచ్ చేస్తూ బుధవారం కమిషనర్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది పూర్తి కావడానికి వస్తుండటంతో కేసుల పెండెన్సీని తగ్గించడం, నాన్‌బెయిల్‌బుల్ వారెంట్లను ఎగ్జిక్యూట్ చేస్తూ నేరాలు నివారిస్తూ పటిష్టమైన శాంతి భద్రతల నిర్వహణే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సీపీ సూచించారు. అందులో భాగంగానే ఇన్‌స్పెక్టర్ల సీనియార్టీని దృష్టిలో ఉంచుకున్నట్లు వెల్లడించారు.

రేపట్నుంచి హైటెక్స్‌లో కామిక్‌కాన్ ఇండియా

సిటీబ్యూరో, నవంబర్ 13(నమస్తే తెలంగాణ): హైటెక్స్‌లో ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు కామిక్‌కాన్ ఇండియా కొలువు దీరనున్నదని నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విభిన్న రకాల కామిక్ క్యారెక్టర్స్ అలరించనున్నాయి. టీవీల్లో పాపులర్ కామిక్ క్యారెక్టర్స్‌లో అభిమానులు సందడి చేయనున్నారు.

కాంగ్రెస్ కార్మిక సంఘాల్లోనూ కుమ్ములాటలు

- జలమండలిలో రెండుగా చీలిన కార్మిక సంఘం
- ఒక సంఘానికి గౌరవాధ్యక్షుడిగా మధుయాష్కి.. మరో యూనియన్‌కు మొగుళ్ల రాజిరెడ్డి
- రెండు యూనియన్ల మధ్య భగ్గుమంటున్న కోల్డ్‌వార్
- అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానన్న మధుయాష్కి
- వచ్చే నెలలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు
- ఎన్నికల వేళ చర్చనీయాంశంగా కాంగ్రెస్ నేతల వ్యవహారం

సిటీబ్యూరో, నవంబర్ 13(నమస్తే తెలంగాణ): అధికార పార్టీ కాంగ్రెస్‌లోనే కాదు.. దాని అనుబంధ సంఘాల్లోనూ అంతర్గత కుమ్ములాటలు పెరిగిపోతున్నాయి. గాంధీభవన్ వేదికగా ఇటీవల జరిగిన గ్రేటర్ ప్రజాప్రతినిధుల సమావేశంలో వర్గాల వారీగా విడిపోయి సమావేశాన్ని రసాభాసాగా మార్చిన సంగతి తెలిసిందే. ఈ బాటలోనే కాంగ్రెస్ అనుబంధ సంఘమైన ఐఎన్‌టీయూసీలోనూ పోటాపోటీ యూనియన్లు ఏర్పాటు చేసుకుంటూ బలప్రదర్శనలకు దిగుతున్నారు. అగ్రకుల, బీసీ సామాజిక వర్గాల మధ్య వైరంగా యూనియన్లు ఏర్పడుతున్నాయి. ఇందుకు జలమండలిలో కాంగ్రెస్‌కు అనుబంధమైన ఐఎన్‌టీయూసీ పేరిట రెండు యూనియన్లు ఉండటమే నిదర్శనం. వచ్చే నెలలో జరిగే జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల వేళ కాంగ్రెస్ అనుబంధ యూనియన్ నేతల మధ్య పోరు ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది.

అధిష్టానం చేరిన పంచాయతీ

జలమండలి గుర్తింపు యూనియన్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్‌లో కుమ్ములాటలు విస్తృత చర్చకు దారితీశాయి. తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్(నం.2898)కు గౌరవ అధ్యక్షుడిగా మాజీ ఎంపీ, ఏఐసీసీ అధికార ప్రతినిధి మధుయాష్కీ గౌడ్ ఉండగా, అధ్యక్షుడిగా సీనియర్ కార్మిక నేతగా గుర్తింపు ఉన్న చెవ్వా సతీశ్‌కుమార్ కొనసాగుతున్నాడు. గత ఎన్నికల్లో స్వల్ప తేడాలో సతీశ్‌కుమార్ యూనియన్ ఓడిపోగా.. అప్పటి నుంచి కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ సంఘంగా కార్మికుల పక్షాన మధుయాష్కి, సతీశ్ కుమార్ నిలబడుతూ వస్తున్నారు. ఐతే ఇటీవల కాలంలో సతీశ్‌కుమార్‌తో కలిసి పనిచేసిన కొందరు కార్మిక నేతలు ఆ యూనియన్ వీడి జలమండలి కామ్‌గార్ యూనియన్ పేరిట కాంగ్రెస్ పార్టీ అనుబంధ యూనియన్ ఇదే నంటూ తెరమీదకు తీసుకువచ్చారు. కామ్‌గార్‌ను గౌరవ అధ్యక్షుడిగా సంజీవరెడ్డి, అధ్యక్షుడిగా ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డితో కలిసి మరో యూనియన్‌గా ఏర్పాటు చేసుకున్నారు. సీనియర్ నేతగా ఉన్న మధుయాష్కిని కాదని సీఎం రేవంత్‌రెడ్డి బంధువు అని చెప్పుకుంటున్న మొగుళ్ల రాజిరెడ్డిని ఆ పార్టీలోని కొందరు ముఖ్యులు ప్రోత్సహించడం, స్థానికేతరుడైన రాజిరెడ్డి ఎలా జలమండలి కార్మిక యూనియన్‌కు వస్తాడన్న సతీశ్ కుమార్ యూనియన్ నేతలు భగ్గుమంటున్నారు. జలమండలిలో బలమైన యూనియన్‌గా తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ ఉందని, ఐఎన్‌టీయూసీ అనుబంధంగా ఒక సంఘం ఉన్న తర్వాత మరో సంఘాన్ని కార్మికులెవ్వరూ గుర్తించడంలేదని మధుయాష్కి గౌడ్ అంటున్నారు. మొగుళ్ల రాజిరెడ్డి అంశాన్ని పార్టీ అధిష్టానంతో చర్చిస్తామని మధుయాష్కి గౌడ్ తేల్చి చెబుతున్నాడు. మొత్తంగా ఎన్నికల సమీపిస్తున్న వేళ ఈ రెండు యూనియన్ల అంతర్గత పోరు ఎటువైపు దారితీస్తుందోనని ఉద్యోగుల్లో చర్చ జరుగుతున్నది.

వచ్చే నెల మొదటి వారంలో ఎన్నికలు

జలమండలి పరిధిలో ఐదు వేల మందికి పైగా ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తుండగా.. ప్రతి రెండేళ్లకోకసారి సంస్థ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరుగుతాయి. గడిచిన రెండు పర్యాయాలు బీఆర్ఎస్‌కేవీ యూనియన్‌దే విజయం వరించింది. ఈ నేపథ్యంలోనే ఇటీవల కార్మిక శాఖ ఇప్పటికే మొదటి నోటీసు జారీ చేయగా.. వచ్చే నెల మొదటి వారంలో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశాలున్నాయి. ఐతే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగా ముందే కాంగ్రెస్ అనుబంధ యూనియన్లు రెండుగా చీలిపోయి చర్చనీయాంశంగా మారింది. మొత్తంగా గుర్తింపు యూనియన్‌గా కార్మికులకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు, కార్మికుల అభివృద్ధికి కృషి చేసిన వాటర్‌వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్(బీఆర్ఎస్‌కేవి)కే వచ్చే ఎన్నికల్లో కార్మికుల మద్దతు ఉంటుందని, గత ఎన్నికల ఫలితాలే పునరావృతం అవుతాయని ఆ యూనియన్ అధ్యక్షుడు రాంబాబు యాదవ్ ఆశాభావం వ్యకం చేస్తున్నారు.

నా కారే ఆపుతారా.. మీ కెంత ధైర్యం

- పోలీసులపై చిందులేసిన సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ
- ట్రాఫిక్ పోలీసుల్ని చూసి డ్రైవింగ్ సీటు నుంచి మారిన మందుబాబు
- పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఏసీపీ
- తనిఖీల్లో పట్టుబడ్డ డ్రైవర్‌ని వదిలేయాలని పోలీసులతో గొడవ
- ఏసీపీతో సహా నలుగురు అరెస్ట్

సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్(ఫైల్)

వెంగళరావునగర్, నవంబర్ 13: అతనో పోలీస్ అధికారి.. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులపై చిందులేశాడు.. నా కారే ఆపుతారా.. మీ కెంత ధైర్యం అంటూ.. నానా రభస చేసి పోలీసు శాఖ పరువుని బజారు పాల్జేశాడు. అమీర్‌పేట్ వైపు నుంచి ఎస్.ఆర్.నగర్ వైపునకు సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్‌తో సహా మరో ముగ్గురు మంగళవారం రాత్రి సఫారీ కారులో వెళ్లారు. అక్కడ ఎస్.ఆర్.నగర్ ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తుండటాన్ని గమనించారు. తప్పతాగి కారు డ్రైవింగ్ చేసిన కారు డ్రైవర్.. కారును ఆపి తన సీటు నుంచి దిగి వెనకాల సీటులోకి.. వెనుకున్న వ్యక్తి డ్రైవింగ్ సీట్లోకి మారాడు. అక్కడే విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుల్ కావేరి ఇదంతా గమనించింది. వెనుక సీట్లోని వ్యక్తి డ్రైవింగ్ చేశాడని ఆమె అక్కడున్న అధికారులకు చెప్పారు. తనిఖీల్లో భాగంగా వారి కారును ఆపి వెనుక కూర్చున్న డ్రైవర్‌ను బ్రీత్ అనలైజర్ పరీక్ష చేసేందుకు ట్రాఫిక్ పోలీసులు యత్నించారు. అంతలో కారులోని వ్యక్తి కిందకు దిగి.. తాను సిద్దపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్‌ను అని.. తమ కారు వదిలేయాలని హుంకరించాడు. కారు నడిపిన మద్యం మత్తులోని డ్రైవర్ జైపాల్‌రెడ్డిని వదిలేయాలని బిగ్గరగా కేకలు వేశాడు. డ్రైవర్ బ్రీత్ అనలైజర్ పరీక్షకు మొండికేశాడు. ఊదొద్దని అతనికి ఏసీపీ అడ్డుపడ్డాడు. అక్కడ తనిఖీలు చేసే కానిస్టేబుల్‌ను ఏసీపీ సుమన్‌కుమార్ తోసేశాడు. కాను బానెట్‌పై గుద్దుతూ.. దూషిస్తూ హల్‌చల్ చేసి పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడు. దాంతో మధురానగర్ పోలీసులకు సమాచారం అందించారు. కారు నడిపిన జైపాల్‌రెడ్డిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి బ్రీత్ అనలైజర్ పరీక్షించగా.. మద్యం తాగినట్లు తేలింది. మోతాదుకు మించి 39 పాయింట్లుగా నమోదైంది. డ్రైవింగ్ చేసిన వ్యక్తి జైపాల్‌రెడ్డి అని.. అల్వాల్‌కు చెందిన వ్యాపారిగా పోలీసులు గుర్తించారు. సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్, కారు నడిపిన జైపాల్‌రెడ్డి, వారితోపాటు ఉన్న ఎం.శ్రీనివాస్, జి.వెంకట్‌రావులపై ఎస్.ఆర్.నగర్ ట్రాఫిక్ ఎస్సై జి.కాంతారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి వారిని అరెస్ట్ చేసినట్లు మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆవరణలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉద్యోగులు

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఆందోళన

- స్థలం కేటాయింపునకు నిరసనగా ర్యాలీ

బంజారాహిల్స్, నవంబర్ 13: జూబ్లీహిల్స్‌లోని డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన 10 ఎకరాల స్థలాన్ని జేఎన్ఏఎఫ్ఏయూకు కేటాయించాలనే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా అంబేద్కర్ వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఉద్యోగులతోపాటు సైన్స్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. వర్సిటీలో విద్యను అభ్యసిస్తున్న అనేక మంది గ్రామీణ విద్యార్థులు పాల్గొని ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యూనివర్సిటీలో కంప్యూటర్, సైన్స్ ల్యాబ్స్ నిర్మాణం చేపట్టాల్సి ఉందని, దీనికోసం మార్క్ చేసిన స్థలాన్ని వేరే సంస్థకు ఇచ్చే అంశాన్ని కనీసం యూనివర్సిటీ అధికారులతో చర్చించకుండా నిర్ణయం తీసుకోవడం బాధాకరమని విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డా.ఎల్.విజయకృష్ణారెడ్డి అన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్‌పర్సన్ ప్రొ.పల్లవీ కాబ్డే, నేతలు ప్రొ.పుష్పా చక్రపాణి, డా.రవీంద్రనాథ్ సోలమన్, డా.ప్రమీల కేతావత్, కాంతం ప్రేమ్‌కుమార్, డా.అవినాష్, డా.రాఘవేంద్ర, డా,జి.అంబేద్కర్, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన, ప్రణాళికతో సివిల్స్ సాధన

రిఫ్లెక్షన్స్ అకాడమీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చీఫ్ మెంటర్ వివేకానంద, డైరెక్టర్ శ్రీరమణ ముప్పాళ్ల, అధ్యాపకులు

మేడ్చల్, నవంబర్ 13: అవగాహన, ప్రణాళికతో సులభంగా సివిల్స్ సాధించవచ్చని రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ చీఫ్ మెంటర్, రక్షణ మంత్రిత్వ శాఖ సహాయ డైరెక్టర్ డాక్టర్ వివేకానంద అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే', 'రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ' ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ పరీక్షలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూపీఎస్సీ సాధించి, సివిల్ సర్వీసెస్‌లోకి రావాలని చాలా మందికి కోరిక ఉన్నప్పటికీ సరైన అవగాహన లేక ఇటువైపు రాలేకపోతున్నారన్నారు. అవగాహన, చక్కటి ప్రణాళిక ఉంటే సునాయాసంగా మొదటి లేదా రెండోసారి తప్పకుండా యూపీఎస్సీ సాధించవచ్చన్నారు. ప్రతిఏటా యూపీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని, వెయ్యి కంటే ఎక్కువ పోస్టులు ఉంటాయన్నారు. 50 శాతం కంటే ఎక్కువ మంది ప్రాథమిక దశలోనే పరీక్షకు గైర్హాజరై, సరిగా సిద్ధంకాక యూపీఎస్సీకి దూరం అవుతారన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ సాధించాలంటే ఉన్నత విద్యా సంస్థల్లో చదువు, కుటుంబ నేపథ్యం, ఆర్థిక పరిస్థితి ఏమి అడ్డుకావన్నారు. ఇంటర్, డిగ్రీల్లో అతి తక్కువ మార్కులు పొందిన వారు కూడా సివిల్స్ సాధించిన వారెంతో మంది ఉన్నారని ఆయన చెప్పారు. రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ శ్రీరమణ ముప్పాళ్ల మాట్లాడుతూ.. యూపీఎస్సీ ఆరుసార్లు రాసే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఏటా నోటిఫికేషన్ వస్తుందని, వెయ్యి నుంచి 1100 పోస్టులు 21 పౌర సేవలకు సంబంధించినవి ఉంటాయన్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంతో మంది ప్రతిఏటా యూపీఎస్సీ సాధిస్తున్నారని తెలిపారు. సరైన మార్గదర్శనం ఉంటే సివిల్ సాధించవచ్చని తెలిపారు. కళాశాల చైర్మన్ జక్కుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. సదస్సు నిర్వహించిన తెలంగాణ పబ్లికేషన్స్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగం సంపాదించడం ఒక్కటే లక్ష్యం కాకుండా సివిల్ సర్వీసెస్‌లోకి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎంఆర్ కార్యదర్శి త్రిశూల్ రెడ్డి, కోశాధికారి త్రిలోక్ రెడ్డి, డైరెక్టర్ మోహన్, ప్రిన్సిపాల్ లోక నాథం, వైస్ ప్రిన్సిపాల్ పురుషోత్తమ్ ప్రసాద్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ హెడ్ శోభ, తెలంగాణ పబ్లికేషన్స్ మేనేజర్ గణేశ్, ప్రసాద్ పాల్గొన్నారు.



బాచుపల్లిలోని కాసాని కన్వెన్షన్‌లో బుధవారం రాత్రి జరిగిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ కుమారుడు రాజేంద్రప్రసాద్ వివాహానికి హాజరై ఆశీర్వదించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, యువనేత కాసాని వీరేశ్‌ముదిరాజు – దుండిగల్, నవంబర్ 13

స్టాల్స్‌ను సందర్శించిన రైతులు తదితరులు

సాగుపై యువ రైతుల ఆసక్తి

వ్యవసాయ యూనివర్సిటీ, నవంబర్ 13: నాడు వ్యవసాయం దండుగ అనుకుని పల్లె విడిచి పట్నం బాట పట్టిన యువత, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు.. అనతి కాలంలోనే సాగుకు ఆ ప్రభుత్వం ప్రోత్సాహం వల్ల గత ఐదారు ఏండ్ల నుంచి తమకు ఉన్న వ్యవసాయ అనుబంధ రంగాల వనరులనే ఉపాధిగా మలుచుకుంటున్నారు యువత. చిరుధాన్యాలతో రుచికరమైన తినుబండారాలు, ఇలా అనేక నూతన ఆవిష్కరణలకు హైదరాబాద్‌లోని జాతీయ వ్యవసాయ పరిశోధన, నిర్వాహణ సంస్థ(నార్మ్) రెండు రోజులపాటు వేదికైంది. సుస్థిర వ్యవసాయ అంకురాల నిర్మాణంపై జరిగిన సదస్సుకు ఇతర రాష్ట్రాల వారితోపాటు ఈ సారి తెలంగాణ యువత సదస్సులో పాల్గొన్నారు. నవీన వ్యవసాయానికి సంబంధించి వినూత్న ఆలోచనలు ఆవిష్కరణలను ఆయా అంకుర సంస్థల వ్యవస్థాపకులు ఆవిష్కరించారు. దాదాపు 50కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు.

దేశ వ్యాప్తంగా మన ఉత్పత్తులు పెరగాలి..

దేశంలో సుస్థిర వ్యవసాయ ఉత్పత్తుల ప్రత్యక్ష, పరోక్షంగా విక్రయాలు, ఎగుమతులు ఆయా సంస్థల అభివృద్ధికి తోడ్పాటునందిస్తాయని నార్మ్ డైరెక్టర్ డా. పి.శ్రీనివాసరావు అన్నారు. రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ ఐసీఆర్-నార్మ్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన దేశంలో స్థిరమైన వ్యవసాయ స్టార్టప్‌ల నిర్మాణం అనే జాతీయ సదస్సులో రెండవ రోజు ఆయన మాట్లాడారు. 13 రాష్ట్రాల నుంచి 47 స్టార్టప్‌లు, 13 ఎఫ్‌పీఓలు, 6 ఐకార్ ఇనిస్టిట్యూట్‌ల ఏబీఐలు, 3 బ్యాంకులు, పరిశ్రమలు, ఐఐటీ, ఆర్యుటిఎజి, మద్రాస్, జీఓఎల్ తమ ఉత్పత్తులను, సాంకేతికతలను స్టాల్స్‌లో ప్రదర్శించారు. కార్యక్రమంలో ఐఐఎంఆర్, న్యూట్రిహబ్ సీఈఓ డా.బి.దయాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల పది పరీక్ష ఫీజు చెల్లించిన సగౌర

సైదాబాద్, నవంబర్ 13: సైదాబాద్ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల వార్షిక పరీక్ష ఫీజును సగౌర చారిటబుల్ సొసైటీ చెల్లించింది. బుధవారం మలక్‌పేట ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సగౌర చారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు సత్యనారాయణ, రిటైర్డు ఐఏఎస్ అధికారి జి.పి.రావు పాల్గొని మండల పరిధిలోని 16 ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న 760 మంది విద్యార్థులకు సంబంధించిన పదవ తరగతి వార్షిక పరీక్షల ఫీజు రూ.90వేలను చెల్లించారు. ఈ సందర్భంగా రిటైర్డు ఐఏఎస్ అధికారి జి.పి.రావు మాట్లాడుతూ.. పరీక్షలు మంచిగా రాసి ఉత్తమ ఫలితాలను సాధించాలని, విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ మండల ఉప విద్యాశాఖ అధికారి తిరునగరి రాధాకృష్ణ, డాక్టర్ ప్రకాశ్, పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మందడి వెంకట్ రెడ్డి, సాంబశివ రావు, నారాయణ, సైదాబాద్ మండల పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేశ్వరరావు, వెంకట్ రెడ్డి, మలక్‌పేట ఇన్‌చార్జి హెచ్ఎం నిర్మల, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కేబీఆర్ పార్కులో పర్యటిస్తున్న ట్రైనీ జడ్జిలు

కేబీఆర్ పార్కును సందర్శించిన జడ్జిలు

బంజారాహిల్స్, నవంబర్ 13: తెలంగాణ రాష్ట్ర జ్యుడిషియల్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 36 మంది జూనియర్ సివిల్ జడ్జిలు బుధవారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ నేషనల్ పార్కును సందర్శించారు. ఆ పార్కులో అటవీ ప్రాంతాన్ని రక్షిస్తున్న తీరు, పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన చర్యలు, పార్కులో ఉన్న వివిధ జాతుల మొక్కలు, పక్షుల వివరాలను కేబీఆర్ పార్క్ రేంజ్ అధికారి లక్ష్మీపతిరావు, మంజుల జడ్జిలకు వివరించారు. పార్కు లోపల ఉన్న ప్యాలెస్‌ను కూడా జడ్జిలు పరిశీలించారు.

ఘనంగా నిజాం కళాశాల మూడవ స్నాతకోత్సవం

బుధవారం రవీంద్రభారతి ఆడిటోరియంలో నిజాం కళాశాల 3వ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన హైదరాబా